'డబుల్ బెడ్రూమ్'లలో వసూల్ రాజాలు..!

● మెయింటనెన్స్ పేరిట ప్రతినెల రూ. వేయి వసూలు ● తాజాగా సభ్యత్వం పేరిట రూ.1100 డిమాండ్
● అందులో ప్రభుత్వానికి రూ.100 ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్న వైనం


బహదూర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం

సుభాష్‌నగర్: నగరంలో గూడు లేని పేదలకు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన డబుల్ బెడ్రూమ్ సముదాయంలో కొంతమంది అక్రమార్కులు సముదాయం ప్రెసిడెంట్ పేరిట వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. దుండిగల్ మున్సిపల్ బహదురుపల్లిలో ఉన్న డబుల్ బెడ్రూమ్ సముదాయంలో గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. స్థానికంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు వచ్చిన ఇద్దరు వ్యక్తులు కలిసి ఒకరు ప్రెసిడెంట్, మరొకరు వైస్ ప్రెసిడెంట్‌గా ప్రకటించుకొని మెయింటనెన్స్ పేరిట ఒక్కో ఇంటి నుంచి ప్రతినెల రూ.1000 వసూలు చేస్తున్నారు. తాజాగా సభ్యత్వం పేరిట రూ.1100 వసూలు చేస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే వారిని టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయాన్ని కొంతమంది 'సాక్షి'తో చెప్పి బోరునా విలపించారు.

8 బ్లాక్‌లలో 900 ఫ్లాట్లు..

బహదూర్‌పల్లిలో 8 బ్లాక్‌లకు గాను 900 ఫ్లాట్లు నిర్మించారు. వీటిని 2023 సెప్టెంబర్ 2న అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా 780 ఫ్లాట్లను పంపిణీ చేశారు. అందులో నియోజకవర్గంలోని వారికే కాకుండా నగరంలోని ఇతర ప్రాంతాల వారికి ఇళ్లను కేటాయించారు. ఇటీవల ఇళ్లలోకి ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్రూమ్ సొంత ఇంటిలోకి లబ్ధిదారులు మార్చి నెల నుంచి వచ్చారు.

తమకు తామే ప్రెసిడెంట్లుగా ప్రకటించుకొని..

డబుల్ బెడ్రూమ్ సముదాయంలో నియోజకవర్గంలో ఉండే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారే అధికంగా ఉన్నారు. ఇదే అదునుగా చేసుకొని ఇద్దరు వ్యక్తులు ఒకరు ప్రెసిడెంట్, మరొకరు వైస్ ప్రెసిడెంట్‌గా ప్రకటించుకొని చలమణి అవుతూ హల్చల్ చేస్తున్నారు. సముదాయంలో ఉన్న ఎనిమిది బ్లాక్ లకు ఒక్కొక్క బ్లాక్‌కు మరో ఇద్దరిని సభ్యులుగా నియమించి మెయింటనెన్స్ పేరిట వారితో ఏప్రిల్ నెల నుంచి జూన్ వరకు ప్రతి నెల ఇంటికి రూ.1000 చొప్పున వసూలు చేయిస్తున్నారు. ఇప్పటికే అలా రూ.లక్షల్లో వసూలు చేశారు.

ప్రశ్నిస్తే.. ఇబ్బందులు పెడతారు

వీరు చేస్తున్న వసూలు ఆగడాలపై లబ్ధిదారులు ఎవరైనా ప్రశ్నిస్తే వారిని టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతున్నారని కొంతమంది లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ప్రతినెల రూ.వేయి ఎందుకు ఇవ్వాలని అడిగిన వారికి నీళ్లు రాకుండా బంద్ చేస్తున్నారని వాపోతున్నారు. వీరి ఆగడాలకు కళ్లెం వేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.

తాజాగా సభ్యత్వం పేరిట....

తాజాగా ఆ ఇద్దరు వ్యక్తులకు మరో ఆలోచన తట్టింది సముదాయంలో ఉన్న ప్రతి ఒక్కరూ సభ్యత్వం పొందాలని అందుకు ఒక్కొక్క ఫ్లాట్ నుంచి రూ.1100లను చెల్లించాలని హుకూం జారీ చేశారు. మంగళవారం నుంచి ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసి రూ.1100 తీసుకొని రిసిప్ట్ అందజేస్తున్నారు. ఇందులో రూ.100 ప్రభుత్వానికి వెళ్తుందన్నారు. రూ.వేయి సముదాయం పేరిట డిపాజిట్ ఉంటుందని లబ్ధిదారులకు చెప్పుకొస్తున్నారు.

ఇళ్లలోకి రావాలంటే వారిని సంప్రదించాల్సిందే....

ప్రభుత్వం తమకు కేటాయించిన ఇళ్లలోకి రావాలంటే ముందుగా ఆ ఇద్దరు వ్యక్తుల అనుమతి తీసుకోవాలని నిబంధన పెట్టారు. ఎవరైనా కొత్తగా వచ్చినవారు వారిని కలసిన అనంతరం ఇళ్లలోకి వెళ్తున్నారు.

◆ లబ్ధిదారులు కొంతమంది ఇటీవల చనిపోగా వారు పిల్లలు ఉండేందుకు రాగా అసలైన లబ్ధిదారులు ఎక్కడున్నారు.? మీరు ఎవరు? అని ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. మా అమ్మ వాళ్లు ఇటీవలే చనిపోయారని కాళ్లావెళ్లా పడ్డ కనికరించడం లేదు. ఇలా కొంతమందిని వెనక్కి పంపిన సంఘటనలూ ఉన్నాయి.

ఉన్నతాధికారులు వస్తున్నారని..

సముదాయానికి ఉన్నతాధికారులు వస్తున్నారని ప్రతి ఒక్కరూ తమ ఫ్లాట్లల్లో ఉండాలని లేకుంటే ఇళ్లను తిరిగి తీసుకుంటారని 2రోజులకు ముందే మెసేజ్ పెట్టి అందరిని ఈనెల 9న రప్పించారు. సదరు వచ్చిన అధికారులు లబ్ధిదారుల వద్ద సంతకం తీసుకుంటుండగా కొంతమంది ప్రశ్నించారు. దీంతో సంబంధించి అధికారులు వీళ్లకు సంబంధించిందని కాదని అసోసియేషన్ ఏర్పాటు కోసమని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు ఆ పేపర్లను చంపివేసి నిప్పు పెట్టారు. తాజాగా సభ్యత్వం పేరిట రూ.1100 వసూలుకు తెరలేరు. ఇప్పుడు సంబంధిత అధికారులు ఆ ఇద్దరు వ్యక్తులపై ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చింతల్: బోయిన్‌పల్లి పరిధిలో విద్యుత్ తీగలపై పడుతున్న చెట్ల కొమ్మలను ఈనెల 29వ తేదీన అధికారులు తొలగించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ అధికారులు 'సాక్షి'కి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు సరఫరా ఆయా ప్రాంతాలలో సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

◆ **కానాజీగూడ, ప్రాగాటూల్స్, ఇండోస్వింగ్ చిన్నతోకట్ట సబ్‌స్టేషన్ల పరిధిలో...**
తిరుమలనగర్, గ్రీన్ ఫీల్డ్స్ కాలనీ, ఖానాజీగూడ, సాయిసాగర్, సాయినగర్ కాలనీ, ఇండోస్వింగ్ ఫీడర్ పరిధిలో గిరి నగర్, గాంధీనగర్, రీగల్ రెక్సనాల్డ్, శివ పార్కింగ్స్, పంచవటి ఫీడర్ పరిధిలోని బాపూజీ నగర్, భావన కాలనీ, ధనలక్ష్మి ఎన్ క్లేవ్ పరిసర కాలనీలలో ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **తిరుమలగిరి సబ్ స్టేషన్ పరిధిలో..**
తిరుమలగిరి సబ్ స్టేషన్ పరిధిలో ఇందిరానగర్, ఎల్‌బీకాలనీ, ప్రాగాటూల్స్ సబ్‌స్టేషన్ ఎల్అండ్‌టీ ఫీడర్ పరిధిలో గాంధీనగర్, ఎల్అండ్‌టీ, వెంకటేశ్వర స్కై టవర్స్, బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గౌతమ్ నగర్ ఫీడర్ పరిధిలో గౌతమ్‌నగర్, ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్, గౌతమ్‌నగర్, ఎన్ఎస్‌కే స్కూల్, శ్రీ సాయినాథ్ నగర్, మహతనగర్ పరిధిలలో ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

◆ **హెచ్ఎంటి సబ్ స్టేషన్ పరిధిలో..**
ఏవోఎల్ ఫీడర్ పరిధిలో హెచ్ఎంటి సబ్‌స్టేషన్ లిమిట్స్, ఎంటీఏఆర్, వైఎంఎస్ ఫంక్షన్‌హాల్ , రంగారెడ్డినగర్, ఏఎస్సార్‌రెడ్డి కాంప్లెక్స్, గురుకులం, శ్రీసాయికాలనీ ఫీడర్ పరిధిలోని భారతినగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12:30 గంటల వరకు సరఫరా నిలిచిపోనుంది.

◆ **ప్రగతి ప్యాక్ ఫీడర్ పరిధిలో..**
ప్రగతి ప్యాక్ ఫీడర్ పరిధిలో ప్రగతి ప్యాక్ కంపెనీ, అసూస్ కంపెనీ, ఎంఎస్ ఇంజనీరింగ్ వర్క్స్, ఆర్అండ్ ఇంజినీరింగ్, ఎల్ఎస్ ఇంజినీరింగ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు.

◆ **రాజ్‌పుడ్ ఫ్రీడర్ పరిధిలో..**
రాజ్‌పుడ్ ఫ్రీడర్ పరిధిలోని రంగారెడ్డి నగర్, రాజ్ ఫుడ్స్, టెక్నో ఎలక్ట్రికల్స్, బాలాజీ ఎలక్ట్రికల్స్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **సిబ్బందికి సహకరించండి: పేట్‌బషీరాబాద్ ఏఈ**
కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర లైన్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుభాష్‌నగర్, మీనాక్షి, సుచిత్ర ఫీడర్ల పరిధిలోని జీడిమెట్ల గ్రామం, బీమా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, డెక్లాతన్, మీనాక్షి ఎస్టేట్స్, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, ఓం బుక్స్ వెనుక వీధి, వెంకటేశ్వరకాలనీ, భజరంగ్ హిల్స్, సర్వోత్తమ్ ఇండస్ట్రీ, సుచిత్ర సర్కిల్ ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు..

◆ **వైష్ణవి, సన్మాన్‌బెల్మూర్ ఫీడర్ల పరిధిలో..**
వైష్ణవి, సన్మాన్‌బెల్మూర్ ఫీడర్ల పరిధిలోని రంగారెడ్డి బండ, వైష్ణవి ఎన్‌క్లేవ్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, ఎస్ఎస్ఎల్ డెవలపర్స్, గంగా ఎన్‌క్లేవ్, సయ్యద్‌నగర్, యాదిరెడ్డిబండ, ఉడ్స్‌కాలనీ, సన్మాన్ హోమ్స్, కూన మహాలక్ష్మినగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 1.30 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

◆ **అపర్ణ, స్టీల్‌సిటీ, కేకే సొసైటీ, దూలపల్లి ఫీడర్ల పరిధిలో..**
కొంపల్లి సెక్షన్ పరిధి అపర్ణ ఫీడర్‌లోని నిధి అపర్ణ పామ్‌గ్రోవ్, వెంకటేశ్వర కాలనీ, దేవేందర్ కాలనీ, మికాసా స్టెర్లింగ్, స్టీల్‌సిటీ ఫీడర్‌లోని దూలపల్లి ఇండస్ట్రీ, కేకే సొసైటీ ఫీడర్‌లోని మొత్తం ఇండస్ట్రీ ఏరియా, దూలపల్లి ఫీడర్‌లోని దూలపల్లి గ్రామం, అశోకా ఏలా మైసన్, సెయింట్ మార్టిన్స్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

◆ **ధోలారీధని, జయభేరీ, నూజివీడు, వెన్‌సాయి ఫీడర్ల పరిధిలో..**
ధోలారీధని ఫీడర్ పరిధిలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాలు, శ్రీకాంత్ రెడ్డి ఎస్టేట్స్, పోచమ్మగడ్డ, జయభేరీ ఫీడర్ పరిధిలో జయభేరి కాలనీ, బ్యాంక్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, నూజివీడు ఫీడర్ పరిధిలో అశ్విన్‌కాలనీ, గ్రీన్ కంట్రీ, సిల్వర్ నెస్ట్, వెన్‌సాయి ఫీడర్ పరిధిలోని ఎన్‌సీఎల్ నార్త్, ఎన్‌సీఎల్ సాయిబాబా ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 12.30గంటల వరకు

◆ **కొంపల్లి ఫీడర్ పరిధిలో..**
కొంపల్లి ఫీడర్ పరిధిలోని కుమ్మరి బస్తీ, మున్సిపల్ కార్యాలయం , ఆంధ్ర బస్తీ, సెంట్రల్ పార్క్, విఘ్నేశ్వర ఫీడర్ పరిధిలోని దుర్గా హోటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు.

◆ **బౌరంపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..**
దుండిగల్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కేవీఆర్ ఫీడర్ పరిధిలోని ప్రణీత్ నేచర్ బౌంటీ, కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ ఉడ్స్, జెఎస్ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హోమ్స్ ప్రాంతాల్లో, లక్ష్మినగర్ ఫీడర్ పరిధిలోని సూరారం విలేజ్, అయ్యప్ప సొసైటీ, విశ్వకర్మకాలనీ, మల్లంపేట్ ఫీడర్ పరిధిలో డ్రీమ్ వ్యాలీ, గ్రీన్ పార్క్, ఆకాష్ లేఅవుట్, మల్లంపేట్ గ్రామం, ఏపీఆర్ విల్లాస్, భౌరంపేట్ ఫీడర్ పరిధిలోని భౌరంపేట్ గ్రామం, ఆర్‌కే లేఅవుట్, సారెగూడెం రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

◆ **జీపీఆర్ ఫీడర్ పరిధిలో...**
నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జీపీఆర్ ఫీడర్ పరిధిలో ఐడీపీఎల్ కాలనీ, జీపీఆర్ లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాల కుల్చివేత


బహదూర్‌పల్లిలోని సర్వే నం.131లో అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చివేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణంపై సంబంధిత అధికారులు కూల్చివేతలు చేపట్టారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని ఓ ప్రజాప్రతినిధి ప్రైవేట్ సర్వే నం.128 పేరిట సర్వే నం.131 ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టాడు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, టీపీఓ సంజన, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ రెడ్డిలు అక్కడికి చేరుకొన్నారు. పోలీసు భద్రత మధ్య 2 బిల్డింగులను 50 శాతం మేర కూల్చివేశారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఒక బిల్డింగ్‌లో 6 గజాలు మాత్రమే ప్రభుత్వ స్థలంలోకి జరిగారని తెలిపారు. అయినప్పటికీ రెండు బిల్డింగ్‌లకు అనుమతి లేకపోవడంతో కూల్చివేతం చేపట్టారు. గతంలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనాల నేపథ్యంలో సర్వే నం.131 ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.

రేపు శ్రీనివాస్‌నగర్ ఎన్నికలు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. రెండేళ్ల కొకసారి జరిగే ఈ ఎన్నికలలో ఈ సంవత్సరం అధ్యక్ష పదవి కోసం నర్సింగ్‌గౌడ్, మురళిగౌడ్, భాను ప్రకాష్ బరిలో ఉన్నారు. గతంలో జరిగిన ఎన్నికలలో నర్సింగ్‌గౌడ్ విజయం సాధించారు. గడువు ముగియడంతో తిరిగి ఎన్నికలు నిర్వహించనున్నారు. శ్రీనివాస్‌నగర్‌లో సుమారు 700పైగా ఓట్లు ఉన్నాయి.

పోలీసులు పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలి


మేడ్చల్ జోన్ పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బందితో సమావేశమైన డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: పోలీస్ సిబ్బంది తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్‌లోని ధృవ కళాశాలలో డీసీపీ నేతృత్వంలో మేడ్చల్ జోన్ పరిధిలోని ఏసీపీ, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ... స్థానికంగా లా అండ్ ఆర్డర్‌కు ఆటంకం కలుగకుండా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు




నిజాంపేట్: బాచుపల్లి సాయినగర్‌లో కాలనీలో పలు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉండటంతో శుక్రవారం సాక్షిలో 'ఏ నిమిషానికి ఏమి జరుగునో'అనే శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీనిపై స్పందించిన బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తన సిబ్బందితో పర్యటించి పలు విద్యుత్ స్తంభాలు పరిశీలించారు. అనంతరం అవసరమై వాటికి మరమ్మతులు చేయించారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్యలను పరిష్కారిస్తామని అన్నారు. సాయినగర్‌లో విద్యుత్ స్తంభాలకు మరమ్మత్తులు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చెరువు స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ వేయాలి


తహసీల్దార్ మతీన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

దుండిగల్: ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు దుండిగల్ తహసీల్దార్ సయ్యద్ మతీన్, ఇరిగేషన్ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ గ్రామంలో అబ్దుల్ మియా కుంట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. అక్కడి అక్రమ నిర్మాణాల్లో ఒకటిని మాత్రమే తొలగించి మిగతా నిర్మాణాలను వదిలేశారని తెలిపారు. తక్షణమే వాటిని సైతం కూల్చివేయాలన్నారు. చెరువు స్థలాన్ని కాపాడి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ నేతలు ఆకుల సతీష్, కృష్ణారెడ్డి, సోను ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్‌గా అనురాధ

జీడిమెట్ల: టీఎస్ఐఐసీ సిద్దిపేట, మేడ్చల్ జోనల్ మేనేజర్‌గా శుక్రవారం అనురాధ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మాధవి బదిలీపై హెడ్ ఆఫీస్‌కు వెళ్లారు. ఆమె స్థానంలో పటాన్‌చెరు జోనల్ మేనేజర్‌గా ఉన్న అనురాధ ఇక్కడకు వచ్చారు. శుక్రవారం ఆమె జీడిమెట్ల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం టీఎస్ఐఐసీ సిబ్బంది మాధవికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి కొత్తగా వచ్చిన అనురాధకు శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ ఈటల

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: కేంద్ర రోడ్డు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఢిల్లీలో ఆయనను కలిసిన రాజేందర్ రాష్ట్రంలోని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కొంపల్లి ఫ్లై ఓవర్ల అండర్ పాస్, నత్తనడకన సాగుతున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, శామీర్‌పేట రోడ్డు, ఎల్‌బీనగర్ అండర్‌పాస్, హుజూరాబాద్ రోడ్డు సమస్యలపై చర్చించారు. హైదరాబాద్‌లో నిర్మించే అన్నీ అండర్ పాస్‌లు కాకుండా ఫ్లై ఓవర్లు నిర్మించాలని కోరారు. హుజూరాబాద్‌లో సింగాపూర్, రాంపూర్, రంగాపూర్, పెద్దపాపాయపల్లి ప్రాంతాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. ఈటల రాజేందర్ లేవనెత్తిన సమస్యలపై స్పందించిన నితిన్ గడ్కరీ మరోసారి సమగ్రంగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రదాయిని


ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న హన్మంతరెడ్డి

నిజాంపేట్: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరప్రదాయినని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్‌కు చెందిన సత్యనారాయణ కుమారుడు సుదీప్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో బాధితులు హన్మంతరెడ్డిని ఆశ్రయించారు. దీంతో ఆయన మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతూ.. రూ.2.5 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. సదరు పత్రాన్ని శుక్రవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో సత్యనారాయణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్‌ను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, మాజీ కౌన్సిలర్ రషీద్, సిద్దయ్య, సిద్దనోళ్ల సంజీవ్‌రెడ్డి, గాదె వినోద్, దినేష్, సంపంగి వెంకటేష్ ఉన్నారు.

పత్తికుంట చెరువులో వేలాది చేపలు మృతి


బాచుపల్లి పత్తికుంట చెరువులో చనిపోయిన చేపలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని పత్తికుంట చెరువులో శుక్రవారం పెద్ద మొత్తంలో చేపలు చనిపోయాయి. వేలాది చేపలు చెరువు పైకి తేలడంతో స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పత్తికుంట చెరువు చుట్టు ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్ల నుంచి నేరుగా చెరువులోని డ్రైనేజీ నీటిని వదలడంతో చెరువు కలుషితమై చేపలు చనిపోయారన్నారు. దీంతో తమకు లక్షలాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మేస్త్రీ మృతి

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి నిర్మాణంలో ఉన్న భవనంలో మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన రామ(30) జీడిమెట్ల డివిజన్ గ్రీన్‌పార్క్‌లోని గణేశ్ బిల్డర్స్ లో నూతనంగా నిర్మిస్తున్న ఐదంతస్తుల భవనంలో మేస్త్రీగా పని చేస్తున్నాడు. 2 నెలల క్రితం సొంత గ్రామానికి వెళ్లిన రామ తిరిగి ఈనెల 27న పనులకు వచ్చాడు. అదే రోజు నిర్మాణంలో ఉన్న భవనంలో మద్యం సేవించాడు. కాగా శుక్రవారం ఉదయం తోటి కార్మికులు చూసే సరికి భవనంలో నిర్మాణంలో ఉన్న లిఫ్ట్ గుంతలో శవమై కనిపించాడు. మద్యం మత్తులో గుంతలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్


ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సామాజికవేత్త రవీందర్ ముదిరాజ్ తదితరులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. గ్రామల గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ విలువ పెంపొద్దని సామాజిక కార్యకర్త కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శివారు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోగల వందలాది గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

స్థలాల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు: గ్రామస్తులు

స్థానికంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు తాత ముత్తాల పేర్ల మీద ఉండటం వల్ల వారు మరణించినా వారి పేర్లపైనే పన్నులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.రెవెన్యూ అధికారులు గ్రామకంఠ ధ్రువీకరణ పత్రాలుగాని, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలు కాని ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీంతో సదరు స్థలాలకు బ్యాంక్ రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధిక వడ్డీతో ప్రైవేటు అప్పులు తీసుకొని, నాలుగైదు గుంటల భూమిని అమ్ముకొని ఇళ్లు నిర్మించుకుంటే జీహెచ్ఎంసీ అధికారులు 100శాతం ఇంటి పన్ను వేస్తున్నారని తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ ధరలు పెంచకుండా తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. బౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కిషన్ రావు, బుచ్చిరెడ్డి, సంబంధిత గ్రామ ప్రజలు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి..

జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ బీ–సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కాలనీలో సీసీ రోడ్డు పనులను చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అదే విధంగా బొడ్రాయి (నాభిశిల) గ్రామదేవత పునః ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే ఆహ్వాన పత్రికను అందజేశారు. మైసమ్మనగర్ ఏ అండ్ బీ బ్లాక్ అధ్యక్షుడు బ్రహ్మానందంచారి, పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులు ముఖేష్ నేత, బండారు రవీందర్ రెడ్డి, కోశాధికారి జమేదార్ సంతోష్ తదితరులు ఉన్నారు.

అధికారులతో కలిసి ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన...

సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్‌లో కొనసాగుతున్న ఇండోర్ స్టేడియం పనులను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఇండోర్ స్టేడియం, పార్కుల అభివృద్ధి వంటి పనలు పూర్తయితే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, నాయకులు లక్ష్మీనారాయణ, యూసుఫ్, ప్రభాకర్, ఎస్ఆర్‌నాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, మల్లికార్జునరావు, బాబీ, పూర్ణచందర్ గుప్త, శేష చారి, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


కార్మికుడిని ఢీకొట్టిన ఉబర్ కారు

● చికిత్స పొందుతున్న శాంతారావు ● క్యాబ్ డ్రైవర్‌పై కేసు నమోదు


ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న నాగాంజనేయులు

జీడిమెట్ల: రోడ్డు పక్కన చెత్త ఎత్తుతున్న ఓ మున్సిపల్ కార్మికుడిని అతివేగంగా వచ్చిన ఉబర్ కారు ఢీకొట్టిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహించే శాంతారావు(39) రోజూమాదిరిగానే శుక్రవారం ఉదయం చింతల్ గణేష్‌నగర్‌లోని ప్రధాన రోడ్డు పక్కన చెత్తను తీసి రిక్షాలో వేస్తున్నాడు. ఈ క్రమంలో బాలానగర్ నుంచి షాపూర్‌నగర్ వైపు వెళ్తున్న కారు (టీఎస్ యూఎం 0507) వేగంగా వచ్చి చెత్త ఎత్తుతున్న శాంతారావును బలంగా ఢీకొట్టింది. దీంతో శాంతారావు ఒక్కసారిగా ఎగిరి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టుకుని రోడ్డుపై పడ్డాడు. అక్కడే ఉన్న స్థానికులు శాంతారావును వెంటనే ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు ఒక కాలు విరిగి మరో కాలుకు గాయమైనట్లు తెలిపారు. శాంతారావు ఫిర్యాదు మేరకు పోలీసులు క్యాబ్ డ్రైవర్ నాగాంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వీధి కుక్కల దాడులపై వెలసిన పోస్టర్లు



జగద్గిరిగుట్ట: వీధి కుక్కల దాడులు ఎక్కువయ్యాయి. దీంతో అవి మనపై దాడి చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు వివిధ కూడళ్లలో బ్యానర్లు, స్టిక్కర్లను అంటిస్తూ అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. వీధి కుక్కలకు ఆహారం ఇచ్చే విషయంలో కూడా వారే బాధ్యత వహించాలన్నారు. వీధులలో వెళ్తున్నప్పుడు కుక్కలు దాడి చేస్తే.. దాడి చేయకుండా ఉండడానికి మనం పాటించాల్సిన నియమాలపై బ్యానర్లలో క్లుప్తంగా తెలుపుతూ ప్రచారం చేస్తున్నారు.